# పరిపూర్ణత్వం

నేనేపనీ సరిగ్గా చేయననీ... అన్నీ మధ్యలో వదిలేస్తాననీ మా ఇంట్లో అక్కా వాళ్లు అంటుంటారు.

నిజమే వీణ కొన్ని రోజులు మిడికాను. వదిలేసాను. వేణువు కొద్దిరోజులు - అదీ నిశ్శబ్దమైపోయిందీ రోజు.

చిన్నప్పటి ఆటలు సరేసరి. ఏ ఒక్క ఆటా దీక్షగా ఆడిన పాపాన పోలేదు. మా అప్పిగాడు ఉన్నన్ని రోజులూ క్రమం తప్పకుండా క్యారమ్స్... బ్యాడ్మింటన్ ఆడేవాణ్ని. వాడు కర్నూలు వదలడం తర్వాత కొద్దిరోజులు బాల్ బ్యాడ్మింటన్ ఆడేవాణ్ణి. అదీ మధ్యలో 'ఫట్'.

ఇలా నాలో అసంపూర్ణతల శాతమే చాలా ఎక్కువ. అట్లాగని సంపూర్ణతలేవో వున్నాయనే భ్రమలు నాకేమీ లేవు.

కానీ అద్భుత చిత్రాన్ని చూసినప్పుడు వర్ణ వియోగం ఖేదం కలిగిస్తుంది.

రచయితగా సాధించింది లవలేశం... సాధించాల్సింది అపారం.

అసలు దేన్నైనా ఎవరైనా పరిపూర్ణంగా సాధించగల్రా? కష్టమేమో? కష్టమేమిటి అసాధ్యం ఎందుకంటే పరిపూర్ణత అన్నది ఓ మిథ్యా భావన కాబట్టి.

నిన్నటికి నిన్న హైదరాబాద్ వచ్చినప్పుడు మిత్రులు రోహిణీకుమార్‌గారి కారులో వెళ్తున్నాం. రోహిణీకుమార్‌గారు ఓ క్యాసెట్ పెట్టారు. అద్భుతమైన గాత్రంతో సుధారంగ నాథన్ పాడుతోంది. స్వరాలు ఆమె కంఠం కొండమీంచి జలపాతంలా దూకుతున్నాయి. ఓ పదినిముషాలు విన్న తర్వాత... ఆ పాటల్లో ఏదో వెలితి కనిపించి... సారీ వినిపించింది... ఆమె పాడుతోంది త్యాగరాజు కృతులు. ఆవిడకి సాహిత్యంపట్ల అవగాహన లేమి ప్రస్ఫుటంగా పాటల్లో వినబడుతోంది. సరే సంగీతప్రియులు ఆమె పాటల్లో తప్పని సరిగా సాహిత్యాన్ని పట్టించుకోకూడదు. ప్రపంచంలోని మహామహా జ్ఞానులూ, తాత్త్వికులూ, కళాకారులూ, శాస్త్రజ్ఞులూ అందరూ అసంపూర్ణులే అంటాడీ వెధవ అని మీరనుకోవచ్చు... అవును ఖచ్చితంగా అసంపూర్ణులే అంటాను.

అయితే నా బోంట్లకీ సామాన్యులకీ ఆ పెద్దవాళ్ళకీ వున్న వ్యత్యాసమల్లా వాళ్లకు

మా బోంట్ల సామాన్యులకంటే చాలాచాలా జ్ఞానం ఉంది. కానీ పరిపూర్ణ జ్ఞానం మాత్రం ఉండదు. (ఎందుకంటే పరిపూర్ణత అన్నదే అసలు లేనిదే!)

* * *

పరిపూర్ణత్వం గురించి ఖలీల్ జిబ్రాన్ ఇలా అంటారు...

మనిషి పరిపూర్ణుడిగా ఎప్పుడు అనుభూతి చెందుతాడంటే తనను తాను అనంత విశ్వంగానూ ఓ తీరంలేని మహాసముద్రంగానూ భావిస్తాడో అప్పుడు.

ఎప్పటికీ శాంతించని జ్వాలగానూ... మలిగిపోని కాంతిగానూ భావిస్తాడో అప్పుడు.

ఎప్పుడైతే తనను తాను ఓ మెత్తటి మలయ పవనంగానూ... మహోధృతమైన తుపానుగానూ... గర్జిస్తూన్న ఆకాశంగానూ... వర్షిస్తూన్న ఊర్ధ్వలోకంగానూ భావిస్తాడో అప్పుడు...

మనిషి ఎప్పుడైతే తనన్తాను పాడే సెలేయేరుగానూ... విరబూసిన వృక్షంగానూ పత్రరహితంగా నగ్నమైన మొక్కగానూ భావిస్తాడో అప్పుడు.

ఓ ఎగసిన మహోన్నత నగంగా... పల్లంలోకి ప్రవహిస్తున్న లోయగా... ఓ సుక్షేత్రంగా... ఓ ఎడారిగా తనను తాను భావిస్తాడో అప్పుడు మనిషి పరిపూర్ణత్వానికి సగం దూరంలో వున్నట్టే...

ఇంకా ఇంకా చాలాచాలా చెబుతూ... ప్రపంచంలో ఈ విశ్వంలో ప్రతీదీ తనగానే భావించినప్పుడు... పరిపూర్ణత్వం సాధించినట్టే అని భావించవచ్చు. ఆ పరిపూర్ణత్వం కూడా... భగవంతుడి నీడకు నీడలాంటిది అనంటాడు.

* * *

***ఇలాంటి వాక్యాలు కొంత సాంత్వనా యిస్తాయి. చాలా ఖేదాన్నీ, దుఃఖాన్నీ కూడా కలిగిస్తాయి. అంతోటి వ్యక్తులం మనం కాగలమా అని...*** ●